క్లుప్తంగా

యువతిని వేధిస్తున్న యువకుడిపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): యువతిని వేధింపులకు గురి చేస్తున్న యువకుడిపై కొత్తపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజీవ్‌శర్మనగర్‌కు చెందిన యువతి గొల్లపూడిలోని మెడికల్ ఆఫ్ ఫిజియోథెరపిస్ట్ కాలేజీలో మొదటి సంవత్సరం చదువుతోంది. యువతికి గతంలో నల్గొండ జిల్లాకు చెందిన పందుల రమేష్‌తో పెద్దలు వివాహం నిశ్చయించారు. అయితే రమేష్ ప్రవర్తన సరిగా లేదని తెలుసుకుని వివాహాన్ని రద్దు చేసుకున్నారు. కొంత కాలంగా రమేష్ ఆ యువతి వెంట పడి మాట్లాడాలని, పెళ్లికి అంగీకరించాలని వేధింపులకు గురి చేయడమే కాకుండా చేతులు కోసుకుంటానని బెదిరింపులకు పాల్పడుతున్నాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

తండ్రీకొడుకులపై దాడి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పాత గొడవలను మనస్సులో పెట్టుకుని తండ్రి కొడుకులపై దాడికి పాల్పడిన ఇద్దరిపై కొత్తపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కేఎల్‌రావునగర్ 7వ లైన్‌లో మనమాల ఏడుకొండల కుటుంబం నివాసం ఉంటుంది. ఏడుకొండలు ఆటో నడుపుకొని జీవనం సాగిస్తుంటాడు. ఏడుకొండలు ఇంటి పక్కనే సాదుపాటి కనక అనే మహిళ కుటుంబంతో కొంత కాలంగా గొడవలు జరుగుతుండగా పెద్దల మధ్య రాజీ కుదుర్చుకున్నారు. మంగళవారం రాత్రి డ్యూటీ ముగించుకొని ఇంటికి వచ్చిన ఏడుకొండలు తన ఆటోను రోడ్డు పక్కన నిలిపాడు. అయితే కనక కుమారులైన గణేష్, మహేష్‌లు ఏడుకొండలు ఆటోలో కూర్చొని మద్యం తాగుతుండగా, వారికి అడ్డుకున్నాడు. దీంతో గణేష్, మహేష్‌లు నోటికి వచ్చినట్లు ఏడుకొండలను తిట్టడమే కాకుండా ఆటో అద్దాన్ని పగులగొట్టారు. అంతే కాకుండా ఏడుకొండలు కుమారుడిపై దాడి చేయడమే కాకుండా ఇంటి అద్దాలను సైతం పగులగొట్టారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ఒత్తిడి లేని విద్య అందించాలి

లబ్బీపేట(విజయవాడతూర్పు):విద్యార్థులకు ఒత్తిడిలేని విద్యను అందించాల్సిన అవసరం ఉందని లేడీస్ సర్కిల్ ఇన్ ఇండియా డైరెక్టర్ శృతి అన్నారు. రౌండ్ టేబుల్ ఇండియా, లేడీస్ సర్కిల్ ఇన్ ఇండియా ఆధ్వర్యంలో బుధవారం ఎంజీరోడ్డులోని భవిష్య జూనియర్ కళాశాలలో మోటివేషన్ క్లాసులు నిర్వహించారు. ఈ సందర్భంగా శృతి మాట్లాడుతూ పేద, బడుగు, బలహీనవర్గాల పిల్లలందరూ చదువుకునేందుకు తమ వంతు తోడ్పాటు అందిస్తామన్నారు. స్నేహభావంతో విద్యలో అందరూ రాణించాలనేది తమ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. పేదరికం వలన ఎవరూ విద్యకు దూరం కాకూడదని, ఎంతో మంది విద్యార్థులకు అవసరమైన సహాయాన్ని అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆ కళాశాల ప్రిన్సిపాల్ యం.శ్రీనివాస్, డాక్టర్ హర్ష, డాక్టర్ అమూల్య, డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

త్రిశక్తి పీఠంలో హుండీ కానుకల లెక్కింపు



కృష్ణలంక(విజయవాడతూర్పు): బస్టాండ్ సమీపంలోని కాళీమాత అమ్మవారి దేవస్థానం (త్రిశక్తి పీఠం)లో అమ్మవారికి భక్తులు సమర్పించిన హుండీ కానుకలు బుధవారం లెక్కించారు. ఏప్రిల్ 13 నుంచి ఆగస్టు 9వ తేదీ వరకు 119 రోజుల్లో భక్తులు సమర్పించిన కానుకలు లెక్కించగా రూ.7,43,265 ఆదాయం లభించింది. ఈవో పి.లోకేశ్వరీ పర్యవేక్షణలో ఆలయ సూపరింటెండెంట్ మధుసూదనరావు ఆధ్వర్యంలో భక్తుల సమక్షంలో కమిటీ సభ్యులు 12 హుండీలను తెరిచి కానుకలు లెక్కించారు. ఆలయ పాలకవర్గ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు గొల్లపూడి పుల్లయ్య, కార్యదర్శి కె.జగదీష్ కుమార్, ఆధ్యాత్మిక సలహాదారుడు బి.హెచ్.వి జయకిరణ్, కమిటీ సభ్యులు జి.సత్యనారాయణ, జగన్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతికి ప్రతీక చేనేత వస్త్రాలు

పటమట(విజయవాడతూర్పు): విశిష్టమైన భారతీయ సంస్కృతికి చేనేత వస్త్రాలు ప్రతీకలుగా నిలుస్తాయని సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) డైరెక్టర్ ఎం.జానకి అన్నారు. పటమట పంటకాల్వ రోడ్డులోని స్టెల్లా కళాశాల ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న చేనేత జౌళి శాఖ, ఆప్కో చేనేత వస్త్ర ప్రదర్శనను బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా జానకి మాట్లాడుతూ అపురూపమైన నైపుణ్యం, సృజనాత్మకతతో చేనేత కార్మికులు అహర్నిశలు కష్టపడి ఇంద్రధనస్సు వంటి చేనేత వస్త్రాలను తయారు చేస్తున్నారని చెప్పారు. వాటిని ప్రతి ఒక్కరూ ఆదరించాలని కోరారు. చేనేత జౌళి శాఖ, ఆప్కో ఈ తరహా ప్రదర్శనలు ఏర్పాటు చేయటం నేత కార్మికులకు ఎంతో ఉపయోగకరమన్నారు. తరతరాల భారతీయ సంస్కృతి, వారసత్వానికి ప్రత్యక్ష నిదర్శనాలుగా చేనేత సోయగాలు నిలుస్తాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ వారంలో ఒకరోజైనా నేత దుస్తులను ధరించాలని కోరారు. కార్యక్రమంలో ఆప్కో జీఎం తనూజారాణి తదితరులు పాల్గొన్నారు.

కొండప్రాంత సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



ఫోర్‌మెన్ బంగ్లా వద్ద స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

వించిపేట(విజయవాడపశ్చిమ): కొండ ప్రాంతాల నివాసితులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం దిశగా చర్యలు చేపట్టినట్లు మాజీ మంత్రి, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం 55వ డివిజన్ కొండప్రాతంలో అధికారులతో కలసి విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తమ దృష్టికి వచ్చిన ప్రతి సమస్య పరిష్కారం దిశగా పనులు చేపట్టినట్లు తెలిపారు. ముఖ్యంగా కొండ ప్రాంతాలలో తాగునీటి సరఫరాపై ఫిర్యాదులు అందాయని, త్వరలోనే పాత తాగునీటి పైప్ లైన్‌లను తొలగించి కొత్త పైప్ లైన్ నిర్మాణాలు చేపట్టనున్నట్లు తెలిపారు. అదే విధంగా ఇక్కడ ఉన్న వాటర్ ట్యాంక్ నుంచి లీకేజీలు పడటంతో వెంటనే మరమ్మతులు చేపట్టాల్సిందిగా అధికారులను ఆదేశించారు. నిత్యం వేల సంఖ్యలో వాహనదారులు రాకపోకలు సాగించే ఎర్రకట్ట రహదారిపై ఏర్పాటు చేసిన బ్రిడ్జి మరమ్మతులకు గురవ్వడంతో త్వరలోనే వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. అదే విధంగా కొండ ప్రాంతావాసులు శుభకార్యాలు చేసుకునేందుకు వెలంపల్లి ఫౌండేషన్ ద్వారా నిర్మించిన కల్యాణ మండపంలో పూర్తి స్థాయి మౌలిక వసతులు ఏర్పాటు చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక 55వ డివిజన్ కార్పొరేటర్ శిరంశెట్టి పూర్ణచంద్రరావు, నాయకులు నాహిద్, సుభానీఖాన్, వాసా బాబు, పల్లె బాబు, జీవన్, డేవిడ్, బూదాల శ్రీనివాసరావు, మార్క్, వెంకట లక్ష్మి, నగరపాలక సంస్థ అధికారులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

వైభవంగా కావడి మహోత్సవం



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి



విమాన కావడి నిర్వహిస్తున్న యువకులు

వన్‌టౌన్ (విజయవాడపశ్చిమ): శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సేవా సమితి (తమిళ సంఘం) ఆధ్వర్యంలో విమాన కావడి మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యేశ్వరుని భక్తులు నిర్వహించిన వివిధ రకాల పూజా కార్యక్రమాలు ఒళ్లు గగుర్పాటు కలిగించాయి. వీపునకు కొక్కేలను దించుకొని తాడుపై వేళాడుతూ నిర్వహించిన విమానకావడి భక్తులను తన్మయుల్ని చేసింది. వన్‌టౌన్‌లోని స్థానిక పాడివీధిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తమిళ భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామికి పూజలు నిర్వహించారు. ముగ్గురు యువకుల వీపు భాగానికి కొక్కేలను గుచ్చి, వారు గాలిలో వేళాడే విధంగా తాడుతో కడతారు. క్రేన్ సాయంతో భూమికి 20 అడుగుల ఎత్తులో 50 అడుగుల మధ్య ప్రయాణం చేస్తూ షణ్ముఖునికి పూజ నిర్వహించడమే విమానకావడిగా పేర్కొంటారు. ఈ విమానకావడిలో మూడు పర్యాయాలు భక్తులు వెనుకకు ముందుకు వెళ్లి వస్తారు. ఈ సందర్భంగా తొలిసారి దండ వేసి పూజ చేయడం, రెండోసారి కొబ్బరికాయ కొట్టి హారతి ఇవ్వడం, మూడో సారి నిమ్మకాయలను మంత్రించి భక్తులపైకి విసరడం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం పలువురు భక్తులు తమ వీపులకు ఇనుప కొక్కేలను తగిలించుకొని వాటితో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి విగ్రహాన్ని ఉంచిన ట్రాక్టర్‌ను లాగుతూ ముందుకు తీసుకెళ్లారు. పెద్ద సంఖ్యలో తమిళ భక్తులు పన్నీరుకావడి, పాలకావడి, పుష్పకావడి తదితర మొక్కులను స్వామికి సమర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఊరేగింపు పాడివీధిలో ప్రారంభమై తారాపేట రైల్వేస్టేషన్, కాళేశ్వరరావు మార్కెట్ బస్‌టెర్మినల్, గద్దబొమ్మ సెంటర్, కెనాల్‌రోడ్డు మీదుగా కృష్ణానదికి చేరుకుంది. అక్కడి నుంచి రథం సెంటర్, బ్రాహ్మణవీధి మీదుగా కొత్తపేట కోమలవిలాస్ సెంటర్‌కు చేరుకున్నారు. అక్కడ ఇంద్రకీలాద్రిపై వేంచేసి ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానానికి చేరుకొని భక్తులు మొక్కులు చెల్లించారు. సమితి నిర్వాహకులు కే.చిన్నిస్వామి మాట్లాడుతూ సుమారు 50 సంవత్సరాలుగా తమ సేవా సమితి ఆధ్వర్యంలో ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. స్వామి వారి అనుగ్రహంతోనే ఏటా విమానకావడి మహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో శేఖర్‌స్వామి తమిళ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'స్టెల్లా' ఆధ్వర్యంలో శాంతియాత్ర



శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న స్టెల్లా కాలేజీ విద్యార్థులు, అధ్యాపకులు

పటమట(విజయవాడతూర్పు): ఆయుధాలు లేని ప్రపంచాన్ని భవిష్యత్ తరాలకు అందించాలని స్టెల్లా కళాశాల ప్రిన్సిపాల్ జస్వింత క్వాడ్రస్ అన్నారు. నాగసాకి, హిరోషిమాపై అణు బాంబులు వేసి 78 ఏళ్లవుతున్న సందర్భంగా కళాశాల ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు బుధవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. అణు బాంబు దాడులకు బలైన వారికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయా దేశాల్లో అంతర్గత ఉద్రిక్తతలు ప్రపంచ అశాంతికి ఆజ్యం పోశాయని ఆందోళన వ్యక్తం చేశారు. అవి మానవ ఉనికిని ప్రశ్నిస్తున్నాయని పేర్కొన్నారు. నిరాయుధీకరణ అనేది సురక్షితమైనదన్నారు. విద్యార్థులు 'యుద్ధానికి నో చెప్పండి,' 'ప్రపంచానికి శాంతిని వ్యాప్తి చేయండి' అంటూ ర్యాలీలో నినాదాలు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఓడి డాక్టర్ జి. లిటిల్ ఫ్లవర్, సీనియర్ అధ్యాపకురాలు పి.పద్మలత, ఇతర ఫిజిక్స్ విభాగం సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీవైఈవో కుమార్

పటమట(విజయవాడతూర్పు): హిరోషిమా – నాగసాకి దినోత్సవంను అణ్యాయుధాల వ్యతిరేక దినోత్సవంగా నిర్వహించాలని డీవైఈవో బి. కుమార్ అన్నారు. పటమటలంక కేఎస్ఆర్ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అణుశక్తిని రెండో ప్రపంచ యుద్ధ కాలంలో హిరోషిమా, నాగసాకి నగరాల వినాశనానికి ఉపయోగించారని తెలిపారు. అలా కాకుండా మానవాళికి అందరికీ అవసరమైన విద్యుత్ తయారీకి అవసరమైన న్యూక్లియర్ రియాక్టర్ ను వినియోగించాలన్నారు. ఈ సందర్భంగా న్యూక్లియర్ రియాక్టర్‌ను కనుగొన్న ఎన్రికో ఫెర్మీకి నివాళి అర్పించారు. ఇటువంటి శాస్త్రవేత్తలను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు అందరూ మానవాళి సంక్షేమం కోసం కృషిచేసే శాస్త్రవేత్తలుగా ఎదగాలని కోరారు. ఈ సందర్భంగా పాఠశాల్లో 8, 9 తరగతి విద్యార్థులకు నిర్వహించిన డ్రాయింగ్, క్విజ్ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు, సర్టిఫికెట్లు అందించారు. జిల్లా సైన్స్ అధికారి మైనం హుస్సేన్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి. లక్ష్మీకుమారి, సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అణగారిన వర్గాల మహిళలపై ఆగని హింస

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): దేశంలో అణగారినవర్గాల మహిళలపై నిత్యం దాడులు, హింస జరుగుతూనే ఉన్నాయని దళిత స్త్రీ శక్తి జాతీయ కన్వీనర్ ఝాన్సీ గెడ్డం అన్నారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం దళిత స్త్రీ శక్తి ఆధ్వర్యంలో 'స్వాతంత్ర్య భారతంలో కులం, మతం, హింస అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అణగారిన వర్గాల మహిళలపై జరుగుతున్న హింసకు మణిపూర్ ఘటనే తార్కాణమని చెప్పారు. ఈ ఘటనలో సిగ్గు పడాల్సింది బాధిత మహిళలు కాదని, యావత్ భారత దేశం సిగ్గుతో తలదించుకోవాలన్నారు. మహిళలపై హింసను అరికట్టాలని కోరారు. నాగార్జున విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగాధిపతి ప్రొఫెసర్ అనిత మాట్లాడుతూ మణిపూర్ అంటేనే భయమేస్తోందని తెలిపారు. ఈ హింసకు ముగింపు లేదా? అని ప్రశ్నించారు. దేశం శాస్త్ర సాంకేతిక రంగాల్లో దూసుకుపోతున్నా మహిళలపై జరిగే అఘాయిత్యాలు, దారుణాలు ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. స్త్రీలకు రాజ్యాంగం హక్కులు కల్పించినా, ప్రత్యేక చట్టాలు ఉన్నా అవి అమలు కావడం లేదని ఆవేదన చెందారు. జీవించే హక్కు, స్వేచ్ఛ కలిగిన దేశంలో ఇటువంటి ఘటనలు జరగడం బాధాకరమన్నారు. సమతా సైనిక్ దళ్ రాష్ట్ర అధ్యక్షురాలు బి.శ్వేత, భూమిక సంస్థ ప్రతినిధి అనుపమ, సఫాయి కర్మచారి నాయకులు బి. శ్రీదేవి, దళిత స్త్రీ శక్తి కో ఆర్డినేటర్లు రోజా, మేరీనిర్మల, కుమారి, లక్ష్మీప్రసన్న, శ్రీనివాస్, భాస్కర్ పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా పరిశీలన 40 శాతం పూర్తి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లాలో చేపట్టిన ఇంటింటి ఓటర్ల జాబితా పరిశీలన 40 శాతం పూర్తయిందని జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు తెలిపారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా పరిశీలిన పూర్తి పారదర్శకంగా జరుగుతుందని చెప్పారు. ఈ నెల 21 నాటికి నూరు శాతం పూర్తి చేస్తామని పేర్కొన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణకు సహకరించాలని కోరారు. సమావేశంలో డీఆర్వో కె.మోహన్‌కుమార్, రాజకీయ పార్టీల ప్రతినిధులు వై.ఆంజనేయరెడ్డి (వైఎస్సార్ సీపీ), శివరాం ప్రసాద్ (టీడీపీ) పి. ఏసుదాస్ (కాంగ్రెస్), బాలు (సీపీఐ) పాల్గొన్నారు.

భార్య అదృశ్యంపై భర్త ఫిర్యాదు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):పనికని ఇంటి నుంచి వెళ్లిన తన భార్య కనబడడం లేదంటూ ఓ భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామకృష్ణాపురం కోడూరు వారి వీధికి చెందిన చిన్న సాయికిరణ్, హరిత దంపతులు నాలుగేళ్ల క్రితం ప్రేమించి వివాహం చేసుకున్నారు. నగరంలోని ఓ వస్త్ర దుకాణంలో ఇద్దరు పనిచేస్తుంటారు. బంగారం కొనుగోలు విషయంలో భార్యాభర్తలకు మధ్య రెండు రోజుల క్రితం గొడవ జరిగింది. ఈ నెల 8వ తేదీన సాయికిరణ్‌కు సెలవు కావడంతో హరిత షాపునకు వెళ్తున్నానని ఇంటి నుంచి వెళ్లింది. మధ్యాహ్నం ఆమెకు ఫోను చేయగా ఎంతసేపటికి ఎత్తలేదు. దీంతో అనుమానం వచ్చి షాపు దగ్గరకు వెళ్లి విచారించగా హరిత పనికి రాలేదని తెలిపారు. ఆమె ఆచూకీ కోసం చుట్టుపక్కల ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల ఇళ్ల వద్ద ఆరాతీసిన ఎక్కడా కనిపించకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు. భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భక్తుల సూచనలు స్వీకరించాలి



తలనీలాలు సమర్పిస్తున్న భక్తులతో మాట్లాడుతున్న చైర్మన్ రాంబాబు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): అమ్మవారికి తలనీలాలు సమర్పించేందుకు విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా చూడాలని, వారికి ఏమైనా సమస్యలు ఎదురైనా వాటిని ఫిర్యాదులు, సూచనల రూపంలో స్వీకరించాలని దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు అధికారులను ఆదేశించారు. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన కేశ ఖండనశాలను బుధవారం చైర్మన్ కర్నాటి రాంబాబు పరిశీలించారు. తలనీలాలు సమర్పించేందుకు విచ్చేసే భక్తుల పట్ల గౌరవంగా మాట్లాడాలని, సిబ్బంది ప్రవర్తన అమ్మవారి ఆలయానికి మంచి పేరు తీసుకువచ్చేలా ఉండాలని చైర్మన్ రాంబాబు పేర్కొన్నారు. భక్తుల తమ అభిప్రాయాలతో పాటు ఫిర్యాదులు, సూచనలు చేసేందుకు పుస్తకాన్ని అందుబాటులో ఉంచాలని, ఆ పుస్తకంలో నమోదయిన ప్రతి అంశాన్ని ఆలయ ఈవో, తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కేశ ఖండనశాలలో పారిశుద్ధ్యాన్ని పరిశీలించిన చైర్మన్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. దుర్గాఘాట్ నుంచి అమ్మవారి సన్నిధికి, అమ్మవారి సన్నిధి నుంచి ఘాట్‌కు దేవస్థానం ఏర్పాటు చేసిన ఉచిత బస్సు సర్వీసులను వినియోగించుకోవాలని భక్తులతో పేర్కొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న లక్ష్మణస్వామి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి పి. లక్ష్మణస్వామి అన్నారు. ఆ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం కార్యక్రమమైన 'మేరా మట్టి – మేరా దేశ్'లో భాగంగా కళాశాల ప్రాంగణంతో పాటుగా గొల్లపూడి తదితర ప్రాంతాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన లక్ష్మణస్వామి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పతాంజలిశాస్త్రి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ మణికంఠ, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

13న 'వాక్ విత్ వెలంపల్లి'ని విజయవంతం చేయండి

నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి



పోస్టర్, టీషర్టు ఆవిష్కరిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి

భవానీపురం(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పుట్టిన రోజును పురస్కరించుకొని ఈ నెల 13వ తేదీ ఉదయం 6గంటలకు భవానీపురం శివాలయం సెంటర్ నుంచి తలపెట్టిన వాక్ విత్ వెలంపల్లి 2కే రన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి పిలుపునిచ్చారు. గొల్లపూడి పరిధిలోని మహాత్మాగాంధీ హోల్‌సేల్ కమర్షియల్ కాంప్లెక్స్‌లోగల సొసైటీ కార్యాలయంలో బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 15న దేవదాయ శాఖ మాజీ మంత్రి, పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వేలాదిగా పాల్గొనాలని, అయితే ముందుగా వారి పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. నియోజకవర్గ అభివృద్ధికి విశేష కృషి చేసిన వెలంపల్లి నియోజకవర్గ దిశ దశను మార్చేశారని కొనియాడారు. ఈ సందర్భంగా 2కే రన్ మారథాన్‌కు సంబంధించి రూపొందించిన టీ షర్టులు, లోగో, బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు కొనకళ్ల విద్యాధరరావు, వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షులు పల్లపోతు మురళీకృష్ణ (కొండపల్లి బుజ్జి), వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, పలువురు కార్పొరేటర్లు, హోల్‌సేల్ కాంప్లెక్స్ అధ్యక్షుడు పరుచూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డుల సమస్యల పరిష్కారానికే 'దర్బార్'





దర్బార్ కార్యక్రమంలో మాట్లాడుతున్న అడ్మిన్ డీసీపీ మోకా సత్తిబాబు, దర్బార్ కార్యక్రమానికి హాజరైన హోంగార్డులు

డీసీపీ మోకా సత్తిబాబు

విజయవాడ స్పోర్ట్స్: విధి నిర్వహణలో హోంగార్డులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే దిశగా 'దర్బార్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అడ్మిన్ డెప్యూటీ పోలీస్ కమిషనర్ (డీసీపీ) మోకా సత్తిబాబు అన్నారు. కమిషనర్ టి.కె. రాణా ఆదేశాల మేరకు విజయవాడ పోలీస్ కమాండ్ కంట్రోల్ రూంలో దర్బార్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. డీసీపీ సత్తిబాబు పాల్గొని మాట్లాడారు. హోంగార్డులు పోలీస్ శాఖలో భాగమేనన్నారు. శాంతిభద్రతల సమస్య తలెత్తినపుడు పరిష్కరించేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలని సూచించారు. బందోబస్తు, ఎస్కార్ట్ విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మంచి ఆహారపు అలవాట్లు, వ్యాయామం చేస్తూ శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉండాలని సూచించారు. వృత్తిపరమైన సమస్యలు ఎదురైతే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. మంగళగిరిలోని ఏపీ పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో గత నెలలో నిర్వహించిన సంక్షేమ కమిటీ సమావేశంలో చర్చించిన పలు అంశాలపై హోంగార్డులకు ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం విధి నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని పలువురు హోంగార్డులు విన్నవించారు. హోంగార్డ్స్ కమాండెంట్ కె.వి.ప్రేమ్‌జిత్, హోం గార్డ్స్ డీఎస్పీ ఐ.మోహన్‌కుమార్, ఆర్ఐ కృష్ణ పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి



ఆంజనేయ నాయక్‌ను సత్కరిస్తున్న కారుమంచి రాజు, చింతకాయల చిట్టిబాబు

విజయవాడ కల్చరల్: ప్రణవీ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికమీద బుధవారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. అమర గాయకులు ఘంటసాల, బాల సుబ్రహ్మణ్యం, భానుమతి, పిఠాపురం నాగేశ్వరరావు తదితరులు గానం చేసిన గీతాలను కారుమంచి రాజు ఆధ్వర్యంలో ఆంజనేయ నాయక్, కృష్ణకుమారి, రూపాశ్రీ షబానా, వద్దాది కామేశ్వరి, పి.శ్రీనివాసరావు ఆలపించారు. ప్రణవీ మ్యూజిక్ అకాడమీ వ్యవస్థాపకుడు కారుమంచి రాజు మాట్లాడుతూ విలువలతో కూడిన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేదిక ద్వారా నూతన గాయనీ గాయకులకు అవకాశం కల్పిస్తునట్లు తెలిపారు. వివిధ సంస్థల ప్రతినిధులు జిలానీఖాన్, చింతకాయల చిట్టిబాబు సీనియర్ గాయకుడు బాలజీకుమార్, గెల్లి సువర్ణ, సత్యవర్ధన్ పాల్గొన్నారు. గాయకుడు ఆంజనేయ నాయక్‌కు యువగాన చక్రవర్తి బిరుదుతో సత్కరించారు.



పోలీసుల రిహార్సల్స్

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్న కార్యక్రమానికి బుధవారం పోలీసులు రిహార్సల్స్ చేశారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ